

అంతర్జాతీయ సదస్సులో..
ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సమ్మేళనంలో బాసర ఆర్జీయూకేటీ నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 8లో▸



పసుపు సాగుకు సమయమిదే..
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.6 /26.3

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. మొత్తంగా వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రుతిక్‌కుమార్ ప్రతిభ



రుతిక్‌కుమార్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

కుంటాల: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నిర్మల్ జిల్లా కుంటాలకు చెందిన అట్టోలి రుతిక్‌కుమార్ ప్రతిభ కనబర్చాడు. కుంటాలకు చెందిన చింత ప్రభ–అట్టోలి సంజీవ్‌కుమార్ దంపతుల రెండో కుమారుడు రుతిక్‌కుమార్ సోమవారం వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 874 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 137 ర్యాంకు సాధించాడు. తండ్రి సంజీవ్ కుమార్ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో మామడ మండలంలో వాటర్‌షెడ్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తల్లి ప్రభ కుబీర్ మండలంలోని గోడాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. రుతిక్ ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు నిర్మల్ వాసవి పాఠశాలలో, ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో చదివి పరీక్షలు రాసి అర్హత సాధించాడు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జూన్ 1 నుంచి 30 వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ జానకీషర్మిల మంగళవారం తెలిపారు. పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు ధర్నాలకు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. నిషేధిత ఆయుధాలు, తుపాకులు, పేలుడు పదార్థాలు వాడరాదన్నారు. డీజేలు , లౌడ్ స్పీకర్ వంటివి పెట్టొద్దని తెలిపారు. ఈ సమయంలో నియమాలు ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ కింద శిక్ష అనుభవిస్తారని వెల్లడించారు.

కరాటే బెల్ట్‌లు ప్రదానం



కరాటేలో ప్రతిభ కనబరిచిన బాలికలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఝాన్సీలక్ష్మీబాయి ఉచిత కరాటే శిక్షణలో 30 రోజులుగా బాలికలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. మంగళవారం కరాటే బెల్ట్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 11 మంది బాలికలకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తేజేందర్‌సింగ్ భాటియా, ఉపాధ్యక్షుడు కొండాజీ శ్రీకాంత్, అమ్ముల భూషణ్, కరాటే శిక్షకురాలు మృణాళిని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్‌ఎం



ఆర్‌ఎంను సన్మానిస్తున్న డీఎం పండరి

నిర్మల్‌టౌన్: ఇటీవలే ఆర్టీసీ ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన భవానీప్రసాద్ మంగళవారం నిర్మల్ డిపోను సందర్శించారు. అంతకుముందు డిపో మేనేజర్ పండరీ శాలువాతో సత్కరించారు. డిపోలోని అన్ని సెక్షన్లను పర్యవేక్షించారు. పలు ఫైళ్లను తనిఖీ చేశారు. నిర్మల్ డిపోను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉంచాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల, అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారిని కలిసిన న్యాయవాదులు



వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారిని నిర్మల్ న్యాయవాదులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాద ట్రైనింగ్ స్టైఫండ్ విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. 2014 నుంచి 2025 వరకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో బీసీ న్యాయవాదులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి, బీసీ న్యాయవాదుల ట్రైనింగ్ స్టైఫండ్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమణగౌడ్, దేవోల్ల రాజు, కొమ్మోజి రమణ, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

చదువుకొనేదెలా?

సతీశ్.. ఊళ్లో ఉంటే పిల్లల చదువులకు కష్టమవుతుందని కుటుంబంతో కలిసి నిర్మల్ వచ్చి అద్దెకుంటున్నాడు. ఉన్న పొలం కౌలుకు ఇచ్చి, జిల్లాకేంద్రంలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. రియల్ ఎస్టేట్, లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్‌గా కష్టపడుతున్నాడు. భార్య టైలరింగ్ చేస్తూ చేదోడుగా నిలుస్తోంది. పాప, బాబు ఇద్దరినీ పేరున్న స్కూల్‌లోనే వేశారు. ఈమధ్య సరైన మార్కెట్ లేకపోవడంతో ఉద్యోగం, పార్ట్‌టైం సంపాదన ఇబ్బందికరంగా మారింది. ఇంతలోనే జూన్ రానే వచ్చింది. పిల్లలకు మంచి చదువులు చెప్పించాలంటే ఆ స్థాయిలో ఫీజుల చెల్లింపులు చదివించాల్సిందే. ఏ ఉద్దేశంతోనైతే ఊరు వదిలి పట్టణం వచ్చామో..! అది నెరవేరుతుందా..! అన్న డైలామాలో పడిపోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో చేసేది ఫీజుల కోసం బంగారం తాకట్టు పెట్టడానికి సిద్ధమయ్యారు. బడీడు పిల్లలున్న ప్రతీ ఇంట్లో ఇప్పుడు వారి చదువులు, ఫీజుల ముచ్చటే నడుస్తోంది.



నిబంధనలు పాటించాలి..



ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి. ఫీజులను ఇష్టారీతిన పెంచడానికి లేదు. ఈ విద్యాసంవత్సరం వీటిపై దృష్టిపెడతాం. ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిసదుపాయాలతో విద్యనందిస్తున్నాం.
–రామారావు, డీఈవో

- త్వరలో పాఠశాలల పునఃప్రారంభం
- ఏటా పెరుగుతున్న ఫీజులు
- మంచిచదువు పేరిట వల
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

నిర్మల్: పాఠశాలలు మరో వారం రోజుల్లో పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన పెరుగుతోంది. పరిమిత వసతులు, సామాన్యమైన బోధనా పద్ధతులతో నడిచే ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపేందుకు ఇష్టపడక, అధిక ఫీజులతో కూడిన ప్రైవేటు చదువులు కొనేందుకు కష్టపడుతున్నారు. విద్యా వ్యవస్థ వ్యాపారంగా మారడం, ఫీజుల భారం, ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలు తల్లిదండ్రులను కలవరపరుస్తున్నాయి.

తల్లిదండ్రులకు ఆర్థిక భారం

విద్యా సంవత్సరం ఆరంభం అంటేనే తల్లిదండ్రులకు ఆందోళన మొదలవుతుంది. పుస్తకాలు, యూనిఫామ్‌లు, బస్సు ఛార్జీలు, పరీక్ష ఫీజులు, వార్షిక ఫీజులు వంటి ఖర్చులు ఒక్క నెలలోనే కుటుంబ ఆదాయాన్ని గణనీయంగా ఖాళీ చేస్తున్నాయి. చాలామంది తల్లిదండ్రులు ఏడాది పొడవునా కష్టపడి సంపాదించిన డబ్బును ఇందుకోసం వెచ్చించాల్సి వస్తోంది. కొంతమంది తమ పిల్లల చదువుల కోసం అప్పులు చేయడం, ఆస్తులను అమ్మడం వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత, బోధనా నాణ్యతలో లోపాలు తల్లిదండ్రులను ప్రైవేటు పాఠశాలల వైపు నెట్టివేస్తున్నాయి. అయితే, ఈ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి, అధిక ఫీజులతో తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నాయి.

పోటీ ప్రపంచంలో పిల్లల భవిష్యత్తు..

ప్రస్తుత పోటీ యుగంలో పిల్లలు విజయవంతం కావాలంటే నాణ్యమైన విద్య అవసరమని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ ఆలోచనతో, చాలామంది తమ పిల్లలను జిల్లా స్థాయి నుంచి హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు పంపి, హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నారు. ఐదు, ఆరు తరగతుల నుంచే ఈ ప్రయాణం మొదలవుతోంది. ఆర్థికంగా స్థిరంగా ఉన్న కుటుంబాలకు ఈ ఖర్చులు పెద్ద భారం కాకపోవచ్చు, కానీ పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ ఆర్థిక ఒత్తిడిని భరించలేక నలిగిపోతున్నాయి. 'పిల్లలకు మంచి చదువు అందిస్తే ఆస్తులు లేకపోయినా భవిష్యత్తు బాగుంటుంది' అనే ఆలోచనతో ఎన్ని కష్టాలైనా భరిస్తూ ముందుకు సాగుతున్నారు.

'క్యాష్' చేసుకుంటున్న స్కూళ్లు..

తల్లిదండ్రుల ఈ ఆవేదనను, ఆశలను కొన్ని ప్రైవేటు పాఠశాలలు నగదుగా మార్చుకుంటున్నాయి. 'వరల్డ్, ఒలింపియాడ్, టెక్నో, ఐఐటీ, ప్రైమ్' వంటి ఆకర్షణీయమైన పేర్లతో, తాము ప్రత్యేకమైన విద్యను అందిస్తున్నామని ప్రచారం చేస్తూ, విద్యా చట్టాలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. తల్లిదండ్రుల బలహీనతను ఈ పాఠశాలలు వినియోగించుకుంటున్నాయి. ఈ పాఠశాలలపై నియంత్రణ లేకపోవడం, బాధ్యతాయుతమైన అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది. ఫలితంగా, ప్రైవేటు పాఠశాలలు తమ ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి.

అమలు కాని ఉత్తర్వులు

ఫీజుల నియంత్రణపై అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేటు పాఠశాలల ఆగడాలు అంతేలేకుండా పోయాయి. 2017 ఫిబ్రవరిలో ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలోని ఒక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 2018 మార్చిలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తూ ఏటా 10 శాతం ఫీజులను పెంచుకోవచ్చునని ప్రతిపాదనలు చేసింది. కానీ ఇంత వరకు ఆ కమిటీ సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదు. 2020 ఏప్రిల్లో ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు నంబర్ 46ను జారీ చేసింది. జీవో నంబర్ 01 ప్రకారం ట్యూషన్ ఫీజులను నియంత్రించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కానీ, ఉత్తర్వుల అమలుకు విద్యాశాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మొదలుకుని మండల విద్యాశాఖ అధికారులకు వరకు ఒక్కరు కూడా ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. అధికారుల తీరుపై అనుమానాలు, ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో తరగతుల వారీగా నెలకు స్కూళ్ల ఫీజులు(రూ. లలో)..

తరగతి	కనిష్టం	గరిష్టం
నర్సరీ	800	1,200
1వ	950	1,800
2వ	1,000	2,000
3వ	1,100	2,500
4వ	1,200	3,000
5వ	1,300	3,000
6వ	1,350	3,500
7వ	1,400	4,000
8వ	1,500	4,000
9వ	1,550	4,500
10వ	1,600	5,000

రైతుల చెంతకే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ అభిలాష అభినవ్



కనకాపూర్‌లో వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

లక్ష్మణచాంద/నిర్మల్ రూరల్: రైతుల భూసమస్యలు పరిష్కరించడానికి రైతుల చెంతకే రెవెన్యూ అధికారులు వస్తారని సదస్సులు ఏర్పాటు చేస్తారని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మండలంలోని కనకాపూర్‌లో, నిర్మల్ రూరల్ మండలం అక్కపూర్‌లో మంగళవారం నిర్వహించిన రెవెన్యు సదస్సులకు అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్‌తో కలిసి హాజరయ్యారు. సదస్సుకు వచ్చిన కలెక్టర్‌కు ఎంపిడీవో రాధ కనకాపూర్ నర్సరీలో పెంచిన పైన్ ఆపిల్ మొక్క అందించి స్వాగతం పలికారు. తమ నర్సరీలో పెంచిన మొక్కతో స్వాగతం పలకడం సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. అనంతరం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు తనకు ఇద్దరు కుమారులని సమానంగా భూములు పంపకం చేసి ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించగా స్పందించిన కలెక్టర్ తహసీల్దార్ అన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అన్నదాతలు తమ భూసమస్యల పరిష్కారానికి రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు జిల్లాలలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూభారతి పోర్టల్‌తో రైతులు సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. గ్రామాలలో సదస్సులు నిర్వహించడానికి రెండు రోజుల ముందుగానే గ్రామంలో చాటింపు చేయించి రైతులకు తెలిసేలాగా చేస్తున్నామన్నా రు. తమ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సమయంలో ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలిపితే రశీదు పొందాలని సూచించారు. ఈనెల 20వ తేదీ వరకు రెండో విడత రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. కుంటాల మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సదస్సులు నిర్వహించామని, అక్కడ వచ్చిన సమస్యలలో 50 శాతం పరిష్కరించామని తెలిపారు. సదస్సులలో తీసుకున్న దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరిస్తామని వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భూసమస్యలు పరిష్కరించు కోవాలని సూచించారు. అక్కాపూర్ పాఠశాలలో తరగతిగదులు, ఇంకుడు గుంత, లైటింగ్ వంటి వసతులను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఖానాపూర్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని మస్కాపూర్, బాదన్‌కుర్తిలోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. వాతావరణంలో మార్పుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే లారీలలో తరలించడంతోపాటు గన్నీ సంచులు, హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం భోజన్న ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

- డీఈవో రామారావు



మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని డీఈవో రామారావు సూచించారు. డీఈవో కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలల ప్రారంభం నాటికి బడులన్నిటినీ శుభ్రపరచి రెడీ చేయాలన్నారు. ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే వసతులు, సౌకర్యాలను వివరించాలని సూచించారు. ఇందులో అధికారులు రమణారెడ్డి, సమన్వయకర్తలు రాజేశ్వర్, నరసయ్య, ప్రవీణ్‌కుమార్, సలోమి కరుణ, శ్రావణి, మహేశ్వర్, కృష్ణవేణి, ఎంఈవోలు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదుకు కళాజాత

- టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రారంభం



మాట్లాడుతున్న దాసరి శంకర్

నిర్మల్‌రూరల్/నర్సాపూర్(జి)/కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు కోసం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కళాజాతను మంగళవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో డీఈవో రామారావు, ఏసీజీ పరమేశ్వర్లు జెండా ఊపి ప్రారంభించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ప్రతీ పల్లెకు ప్రచార వాహనాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను వివరిస్తామన్నారు. డిజిటల్ క్లాసులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాలు, అనుభవం గల ఉపాధ్యాయుల గురించి తల్లిదండ్రులకు వివరిస్తామని తెలిపారు. మన పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పిద్దామని నినాదంతో కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో రాజునాయక్, అంబటి నారాయణ రాజేశ్వర్ బాపిరెడ్డి పోశెట్టి, వినోద్, నారాయణ వర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి), కుంటాల మండలాల్లో..

నర్సాపూర్(జి)/కుంటాల: పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ కోరారు. నర్సాపూర్(జి), రాంపూర్ గ్రామాల్లో, కుంటాల మండలం కల్లూరు, ఓర్లి(కే) క్రాస్ రోడ్డు బడిబాటలో భాగంగా మంగళవారం ప్రచారజాత నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగైతే పేద పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు గట్టు శ్రీనివాస్, కుంటాల పోశెట్టి, రమేశ్, రాథోడ్ గణపతి, చందుల వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడి



విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

కడెం: నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి సాధ్యమని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.శేషు, మండల వ్యవసాయాధికారి పి.దినేశ్ అన్నారు. మండలంలోని పెద్దబెల్లాల్ రైతు వేదికలో 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సాగులో నాణ్యమైన విత్తనం ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. విత్తనాలను పంపిణీ చేశారు. ఇందులో ఏఈవోలు నవీన్, జె.సాయికృష్ణ, డి.శాలిని, రైతులు పొద్దుటూరి సంతోష్ రెడ్డి, అకుల శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో నేడు పోలీస్ ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ జానకీషర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. భైంసా సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు నేరుగా కలిసి ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నిర్మల్ రూరల్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 68 మంది విద్యార్థులకు 61 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. వీరందరికీ జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో రామారావు, జిల్లా పరీక్షల అధికారి పరమేశ్వర్ తనిఖీ చేశారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు.

అసంపూర్తి వంతెనలు.. వానొస్తే తిప్పలు

వర్షాకాలం ప్రారంభమైంది. రుతుపవనాల రాకతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం భారీ వర్షాలు కురిశాయి. దీంతో కడెం మండలంలో వాగులు పొంగి ప్రవహించాయి. దీంతో మారుమూల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో గతంలో కురిసిన వర్షాలు, పొంగిన వాగులకు వంతెనలు కొట్టుకుపోయాయి. కొన్ని చోట్ల కొత్త వంతెనలు నిర్మిస్తుండగా, కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక వంతెనలు నిర్మించారు. ప్రస్తుతం వర్షాకాలం మొదలైన నేపథ్యంలో తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఇక శిథిలావస్థకు చేరిన వంతెనలు కూలిపోతాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఖానాపూర్, సారంగపూర్, తానూరు, భైంసా ప్రాంతాల్లో వంతెనలు, రోడ్ల నిర్మాణంలో జాప్యం, తాత్కాలిక రోడ్ల సమస్యలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి, పనులను పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



అంబేడ్కర్‌నగర్ శివారులో తాత్కాలిక రోడ్డు



రెంకోని వాగుపై తాత్కాలిక రోడ్డు

- కొన్ని నిర్మాణ దశలో..
- మరికొన్ని శిథిలావస్థలో..
- తాత్కాలిక రోడ్లతో పొంచి ఉన్న ప్రమాదం

సాక్షి ఫోకస్

ఖానాపూర్ :ఖానాపూర్ పట్టణంలోని గాంధీనగర్, అంబేడ్కర్ నగర్ శివారు ప్రాంతాల్లో రెంకోని వాగుపై సుమారు రూ.10 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. అధికారుల అలసత్వం కారణంగా తుది దశ పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఈ వంతెన 20కి పైగా గ్రామాలతోపాటు మంచిర్యాల, జన్నారం వైపు వెళ్లే ప్రధాన రహదారిగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో చిన్నపాటి వరదలకే గతంలో తాత్కాలిక రోడ్లు కొట్టుకుపోయాయి. పలు గ్రామాలకు నెలల తరబడి రాకపోకలు నిలి చిపోయాయి. ఈ ఏడాది కూడా వానాకాలం మొదలైనా వంతెన పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు.

సుభాష్‌నగర్‌లో..

సుభాష్‌నగర్ శివారులో హైటెక్ సిటీకి వెళ్లే మార్గంలో వాగుపై నిర్మించిన తాత్కాలిక రోడ్డు మీదుగా వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ ఏడాది కూడా ఆ పరిస్థితి తప్పేలా లేదు. గతంలో వర్షాల కారణంగా ఈ రోడ్డు పలుమార్లు కొట్టుకుపోయాయి. దీంతో వాగు అవతలి వైపున ఉన్న మైనారిటీ స్కూల్ విద్యార్థులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సరిహద్దు గ్రామాల్లో లో–లెవల్ వంతెనలు..



ఝరి(బి) లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు(ఫైల్)

తానూరు : మహారాష్ట్ర సరిహద్దులోని ఝరి(బి), ఝరి(బి) తండా, మొగ్లి, మసల్గా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో లో–లెవల్ వంతెనల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికే వాగులో వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. పొలాలు, చేల వద్దకు ఎరువులు తీసుకెళ్లడం కష్టమవడంతో రైతులు ముందస్తుగా నిల్వలు చేసుకుంటున్నారు. భారీ వర్షాలు కురిస్తే మొగ్లి, మసల్గా గ్రామాల నుంచి మండల కేంద్రమైన తానూరుకు చేరాలంటే 10 కిలోమీటర్లు చుట్టుకోవాల్సి వస్తోంది. అధికారులు హైలెవల్ వంతెనలు నిర్మించి రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

సారంగపూర్‌లో..



జామ్ నుంచి మహవీర్‌తండాకు వెళ్లే దారిలో కోమటి చెరువు అలుగు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామం నుంచి కోమటి చెరువు కట్ట మీదుగా మహవీర్ తండాకు వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లతో బీటీ రోడ్డు మంజూరైంది. కాంట్రాక్టర్ శరవేగంగా పనులు చేపడుతున్నా వర్షాకాలంలో అలుగు దాటడం కష్టంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే రోడ్డు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది. చిన్నపాటి వంతెన నిర్మిస్తే రోడ్డు నిర్మాణం సార్థకమవుతుందని స్థానికులు సూచిస్తున్నారు.

వంతెన లేక కష్టాలు



వాడి గ్రామం వద్ద కూలిపోయిన వంతెన

భైంసారూరల్: భైంసా పట్టణ సమీపంలోని వాడి గ్రామం, కోతల్‌గాం పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉంది. రేషన్, పెన్షన్, ఉపాధి హామీ వంటి అవసరాల కోసం కోతల్‌గాంకు వెళ్లాల్సి ఉంటుంది. ఏడేళ్ల క్రితం రంగారావు ప్రాజెక్టు వరదలతో వాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. దీంతో వర్షాకాలంలో 2 కిలోమీటర్ల దూరంలోని కోతల్‌గాంకు చేరాలంటే 18 కిలోమీటర్లు చుట్టి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు వంతెన నిర్మించి ఈ ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధం



షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన ఎలక్ట్రిక్ బైక్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శివాజీచౌక్‌లో ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. జిల్లా కేంద్రానికి చెందిన విజయ్‌కేతన్ తన ఎలక్ట్రిక్ స్కూటీని శివా జీచౌక్‌లోని చించరవాడ హనుమాన్ ఆలయం ఎదుట మంగళవారం పార్కింగ్ చేశాడు. ఆ సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనున్న మరో యాక్టీవ బైక్‌కు అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పి వేసేందుకు యత్నించగా, అప్పటికే రెండు వాహనాలు కాలిబూడిదయ్యాయి. వాహనాల యజమానులు అయోమయానికి గురయ్యారు.

చోరీకి పాల్పడిన నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపారు. కాలనీకి చెందిన గైక్వాడ్ అనిత ఇంట్లో తిర్పెల్లికి చెందిన ఠాకూర్ నర్సింలు చోరీకి పాల్పడ్డాడు. గ్యాస్ సిలిండర్‌తో పాటు రూ.వెయ్యి నగదు అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

భైంసా: ముధోల్ మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో బాసర-భైంసా రహదారిపై సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మహారాష్ట్ర వాసి గాయపడ్డాడు. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా ముదిర్యాల గ్రామానికి చెందిన మహ్మద్‌మోజియాద్ భైంసా నుంచి నిజామాబాద్‌వైపు లారీని తీసుకెళ్లూ భోజనం కోసం రోడ్డు పక్కన ఆపాడు. భోజనం అనంతరం లారీ వైపుకు వెళ్తుండగా నిజామాబాద్ నుంచి భైంసాకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో మోజియాద్ కుడికాలు విరిగింది. స్థానికులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నిర్మల్: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ యువకుడు గాయపడిన ఘటన నర్సాపూర్(జి) మండలంలో మంగళవారం జరిగింది. బాసరకు చెందిన లక్ష్మీనారాయణ బైక్‌పై నిర్మల్‌వైపు వెళ్తుండగా, నర్సాపూర్(జి) గ్రామ శివారులో 61వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గడ్డి దగ్ధం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఛత్రునగర్ గ్రామంలో రైతు ముజీబ్ ఖాన్‌కు చెందిన డెయిరీఫాంలో నిల్వచేసిన గడ్డి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. డెయిరీ ఫాంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు అంటుకున్నాయి. ఈ క్రమంలో అందులో నిల్వ ఉంచిన గడ్డి, చొప్ప కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. కాగా, ఆ సమయంలో ఫాంలో గేదెలు, ఆవులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

పసుపు సాగుకు సమయమిదే..

- జిల్లాలో పెరుగుతున్న సాగువిస్తీర్ణం..
- కొత్త విధానంతో అధిక దిగుబడి



మల్చింగ్ పద్ధతిలో పసుపు పంట సాగు(ఫైల్)



సోన్ మండలం వెల్మల్‌లో పసుపు కొమ్ములు నాటేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

మామడ:ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పొరుగున్న ఉన్న నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం, పసుపునకు మద్దతు ధర లభిస్తుండడంతో ఈ ఏడాది కూడా పసుపు సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తన పసుపు తెచ్చుకుని విత్తేందుకు సిద్ధం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో గత సంవత్సరం 5,542 ఎకరాల్లో పసుపు సాగు చేయగా, ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల విస్తరణ, వర్షాలతో రైతులు పసుపు సాగుకు సిద్ధమవుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని అధికారులు సూచిస్తున్నారు.

అనుకూల నేల

పసుపు సాగుకు నీరు నిల్వ ఉండని నల్లరేగడి, ఎర్ర చెల్క, ఇసుక నల్లని నేలలు, ఉదజని సూచిక (పీహెచ్) 6 నుంచి 7.5 వరకు, సేంద్రియ పదార్థాలు అధికంగా ఉన్న భూములు అనుకూలం. క్షార గుణం, రాళ్లు ఉన్న నేలలు పసుపు పంటకు సరిపడవు. భూసార పరీక్షల ద్వారా నేల స్వభావాన్ని తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు

పసుపు సాగులో విత్తన ఎంపిక కీలకం. ప్రతీ మూడేళ్లకు విత్తన మార్పిడి చేయడం వల్ల తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. జిల్లాలో దీర్ఘకాలిక రకాలైన దుగ్గిరాల ఎరుపు, ఆర్మూర్, సేలం రకాలను రైతులు సాగు చేస్తున్నారు. తల్లి (మండ) దుంపలు విత్తనాలుగా వాడితే పిల్ల (కొమ్ము) దుంపల కంటే అధిక దిగుబడి లభిస్తుంది. ఎకరానికి తల్లి దుంపలు 8 క్వింటాళ్లు, పిల్ల దుంపలు 5 క్వింటాళ్లు అవసరం. విత్తనాలను కనీసం రెండు కణుపులతో కత్తిరించి వాడితే విత్తనం ఆదా అవుతుంది. పంట మార్పిడి పాటించడం ద్వారా మినుము, పెసర, సోయా, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడం లాభదాయకం.

విత్తన శుద్ధి పద్ధతులు

పసుపు విత్తనాలను నాటే ముందు లీటరు నీటికి 3 గ్రాముల రిడోమిల్ ఎంజడ్, 2 ఎంఎల్ డైమిథోయేట్ కలిపి ద్రావణం తయారు చేసి, 45 నిమిషాలు విత్తన కొమ్ములను నానబెట్టి శుద్ధి చేయాలి. అనంతరం ట్రైకోడెర్మా విరిడే శిలీంధ్ర నాశినితో శుద్ధి చేసి నాటాలి. నాటడానికి 2–4 వారాల ముందు 1 కిలో ట్రైకో ఫ్రైమ్ పొడిని 10 లీటర్ల నీటిలో కలిపి 25 కిలోల విత్తనాలను శుద్ధి చేయాలి. దుక్కిలో ఎకరానికి 200 కిలోల వేపపిండి, 50 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, పశువుల పేడ వాడాలి. 40 రోజుల తర్వాత 200 కిలోల వేపపిండి, 50 కిలోల యూరియా, 80 రోజుల తర్వాత 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్, నాలుగు నెలల తర్వాత 50 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వాడి మెళకువలు పాటిస్తే మంచి దిగుబడి సాధ్యం.

మల్చింగ్ పద్ధతితో..

బెడ్, మల్చింగ్ పద్ధతులతో పసుపు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. బెడ్ కొలతలు 110 సెం.మీ. వెడల్పు, 20 సెం.మీ. ఎత్తు, 30 సెం.మీ. దూరంతో ఉండాలి. ఈ పద్ధతి ద్వారా దుంపకుళ్లు తగ్గి, 20% అధిక దిగుబడి లభిస్తుంది. ఎకరానికి 35 వేల పసుపు మొక్కలు వచ్చేలా చూసుకోవాలి. పొడవైన మడులు తయారు చేసి, 30 ఎంఎం ప్లాస్టిక్ కవర్‌తో కప్పాలి. బిందు సేద్యం ద్వారా నీరు, పోషకాలు అందించాలి. మల్చింగ్ వల్ల కలుపు మొక్కలు తగ్గి, రసాయనాల వాడకం, కూలీల ఖర్చు తగ్గుతుంది.

బెడ్ పద్ధతిలో సాగు చేస్తున్నా..



నేను ఐదెకరాల్లో పసుపు పంటను సాగు చేస్తున్నాను. పసుపు విత్తనం నాటే ముందు విత్తన శుద్ధి చేయడం ద్వారా దుంపకుళ్లు వంటి తెగులు రాకుండా ఉంటుంది. పసుపు బెడ్ పద్ధతిలో సాగు చేయడం ద్వారా దిగుబడి ఎక్కువగా వచ్చింది. – చిన్నారెడ్డి, రైతు, కొరటికల్

మల్చింగ్ పద్ధతిలో..



పసుపు సాగులో రైతులు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువులు, సూక్ష్మపోషకాలు అందించడంలో మెలకువలు పాటించాలి. మల్చింగ్ పద్ధతిలో పసుపు పంటను సాగు చేయడం ద్వారా రైతులు కలుపు మొక్కలను సులభంగా నివారించవచ్చు. పెట్టుబడి ఆదా చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చు. – మౌనిక, ఉద్యానశాఖ అధికారి, నిర్మల్ డివిజన్

'పోడు' భూములను లాక్కోవద్దు



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు ఫాక్స్ ద్వారా వినతిపత్రం పంపుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం అటవీ పరిధిలో పోడు భూముల్లో ఏళ్లుగా సాగు చేస్తుకుంటున్న తమను అటవీ అధికారులు అడ్డుకోవడం సరికాదని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈమేరకు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాంకు మంగళవారం ఫ్యాక్స్‌ద్వారా వినతిపత్రం పంపినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్రస్తుతం మొక్కలు నాటుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

మామడ:నిర్మల్ జిల్లా మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన ఎర్రం సతీశ్ బైండోవర్ ఉల్లంగించినందుకు మంగళవారం రూ.40 వేల జరిమానా విధించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. సతీశ్ గతంలో నల్ల బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ ఉల్లంఘించి మళ్లీ నల్ల బెల్లం, పటిక విక్రయిస్తూ పట్టుబడటంతో కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరు పర్చారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు రూ.40 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది ఇర్ఫాన్, వెంకటేశ్, హరీశ్ పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన లారీ

- ముగ్గురికి గాయాలు



గాయపడిన పాల్సిరాం, గుగ్లోత్ శశికాంత్



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం డ్యాంగాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో కల్వర్టు వద్ద మంగళవారం స్కూటీని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన గుగ్లోత్ శశికాంత్, ఆయన తండ్రి పాల్సీరాం, తల్లి శవంతాబాయి గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుగ్లోత్ శశికాంత్ తన స్కూటీపై తల్లిదండ్రులను ఎక్కించుకుని ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. ఇదేసమయంలో ఎదురుగా నిర్మల్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ తిరుపతి లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న ముగ్గురు ఎగిరి కిందపడ్డారు. తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



కుడ్మేత దత్తు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: గత నెల 29న మావల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కుడ్మేత దత్తు (23) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సీఐ కర్రె స్వామి తెలిపిన ప్రకారం వివరాలు.. మావల మండలంలోని వాఘపూర్ గ్రామానికి చెందిన దత్తు ఆటో ట్రాలీతో భోరజ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మావల శివారులో రోడ్డుకు పక్కన వాహనాన్ని నిలిపి ఆటోపై ఉన్న పరద సరి చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు అతడిని వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దత్తుకు తీవ్ర గాయాలవగా వెంటనే స్థానికులు రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు అదే రోజు హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను కుటుంబసభ్యులు సోమవారం మళ్లీ రిమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ గోవర్ధన్‌రెడ్డి

లక్ష్మణచాంద:నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే వడ్యాల్ గ్రామానికి చెందిన రావులబండి ముత్తన్న(51) మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని సరస్వతీ కాలువవైపు కాలకృత్యాల కోసం వెళ్లాడు. ఆకస్మాత్తుగా కాలువలోకి జారీపడిపోయాడు. అటువైపుగా వెళ్లిన స్థానికులు సరస్వతీ కాలువలో మృతదేహం చూసి పోలీసులకు సమాచారం అందించారు. సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట మామడ ఎస్సై అశోక్, ఏఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.

నీటిగుంతలో పడి బాలుడు..



మృతుడు షల్కె సాయినాథ్

కుభీర్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం హల్దా గ్రామంలో మంగళవారం సాయంత్రం ఓ బాలుడు గుంతలో పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన షల్కె సాయినాథ్ (09) బహిర్భూమికి వెళ్లాడు. తర్వాత చెరువులోని నీటిగుంత వద్దకు వెళ్లాడు. అదుపు తప్పి గుంతలో పడ్డాడు. మొరం కోసం తవ్విన గుంత కావడం, ఇటీవల కురిసిన వర్షాలకు గుంత నిండడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రుల గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. తండ్రి ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్..

తాండూర్: మండలంలోని రేపల్లెవాడ శివారు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి వైపు నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ భుక్య రాజేష్(37) అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కన కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సోమగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోటోవేటర్ కింద పడి యువకుడి..

భైంసా: నిర్మల్ జిల్లా ముధోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్(28) మంగళవారం ట్రాక్టర్ రోటవేటర్ కింద పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో భూమి చదును చేస్తుండగా ట్రాక్టర్‌పై ప్రవీణ్ కూర్చున్నాడు. ఈ క్రమంలో అదుపు తప్పి కిందపడి రోటావేటర్‌లో చిక్కుకున్నాడు. గమనించిన డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపి చూసేసరికి మృతిచెందాడు. ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబీకులు ట్రాక్టర్ యజమాని న్యాయం చేయాలని, అప్పటి వరకు మృతదేహం తరలిచొద్దని పట్టుబట్టారు. ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ సంఘటన స్థలానికి చేరుకుని సముదాయించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

అంతర్జాతీయ సదస్సులో ఆర్జీయూకేటీ విద్యార్థులు

- హైదరాబాద్ ఐఐటీలో స్పిక్ మెకే పదో అంతర్జాతీయ సమ్మేళనం
- వారం రోజులపాటు సాంస్కృతిక ఉత్సవం



సమ్మేళనంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

బాసర: ఐఐటీ హైదరాబాద్‌లో స్పిక్ మెకే 10వ అంతర్జాతీయ సమ్మేళనం వారం రోజులపాటు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ) నుంచి 35 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సాంస్కృతిక చైతన్యం, దేశీయ కళలపై గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. ఈ అవకాశం వారి వ్యక్తిత్వ వికాసానికి ఒక గొప్ప వేదికగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

వాలంటీర్లుగా సేవలు

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు సహాయం అందించడంలో ఆర్జీయూకేటీ విద్యార్థులు వాలంటీర్లుగా చురుగ్గా పాల్గొన్నారు. వారు తమ సేవల ద్వారా అందరి మన్ననలు పొందారు. అంతేకాకుండా, మీడియా విభాగంలో చేరి స్పిక్ మెకే సమ్మేళనంపై విస్తృతంగా ప్రచారం చేయడంలో కీలకపాత్ర పోషించారు.

కళల వర్క్‌షాప్‌లలో..

సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లలో విద్యార్థులు కథక్, కూచిపూడి, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, గోండు పెయింటింగ్ వంటి సంప్రదాయ కళలను నేర్చుకున్నారు. ఈ వర్క్‌షాప్‌లు విద్యార్థులకు కళల పట్ల లోతైన అవగాహన, నైపుణ్యాన్ని అందించాయి.

కళాకారులతో సమావేశం..

స్పిక్ మెకే సమ్మేళనం భారతీయ కళలను ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు, విద్యార్థులకు ప్రముఖ కళాకారులను కలిసే అవకాశాన్ని కల్పించింది. ఈ అనుభవాలు తమ జీవితంలో ఎంతో స్ఫూర్తినిస్తాయని, కళల పట్ల అభిరుచిని మరింత పెంపొందించాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. వారు విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూ, కార్యక్రమ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ద్వారా వారు నేర్చుకున్న కళలు, పొందిన అనుభవాలు వారి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని ప్రొఫెసర్ గోవర్ధన్ అభిప్రాయపడ్డారు. ఈ సమ్మేళనంలో ఆర్జీయూకేటీ నుంచి అధ్యాపకులు డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాకేశ్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు శివ బాలాజీ, వంశీకృష్ణ, రచన, మణికంఠ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



బడిబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్: వందశాతం గిరిజన విద్యార్థుల నమోదు లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని డీడీలు, డీటీడీవోలు, ఏటీడీవో, పీఎంఆర్సీ సిబ్బందితో ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల పరిధిలోని గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహించి విద్యార్థులను బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సదుపాయాలు, విద్యా బోధన తీరును వివరించాలన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, డివిజన్‌ల వారీగా ఏటీడీవోల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చే యాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రోజు వారి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని సీబాపు కాలనీ సమీపంలో మంగళవారం సాయంత్రం కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన సయ్యద్ దావుద్(18)దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు బండ రాయితో కొట్టి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఐదుగురు వ్యక్తులు గంజాయి సేవించి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. యువకుడి హత్యకు ప్రేమ వ్యవహారం లేదా గంజాయి మత్తులో ఎవరైనా ఈ దారుణానికి పాల్పడ్డారా? అనే కోణంలో స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై సందీప్‌కుమార్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. హత్యకు సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

హత్యకు దారితీసిన పాత పరిచయం

- సహజీవనం చేస్తున్న మహిళతో కలిసి చోరీ, హత్య
- ఏడు నెలల తర్వాత వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్



వివరాలు వెల్లడించిన డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో సంచలనం రేపిన మహిళ హత్య మిస్టరీని ఎట్టకేలకు ఏడు నెలల తర్వాత పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు స్థానిక రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారు. మంగళవారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన కూస లక్ష్మి(55) భర్తను వదిలి మంచిర్యాలలోని గణేష్‌నగర్‌లో ఒంటరిగా ఉంటూ కూరగాయలు, బియ్యం వ్యాపారం చేసేది. ఈ క్రమంలో కాలేజీరోడ్‌లో నివాసం ఉండే పెద్దపల్లి జిల్లా స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత హైదరాబాద్‌లోని సుచిత్ర ప్రాంతంలో కుటుంబంతో నివాసం ఉంటూ బార్బర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నరేష్ కుమారుడికి ఆరోగ్యం బాగాలేక అక్కడే ఆస్పత్రికి తీసుకెళ్లగా నర్సు అతినారపు అలివేలుతో పరిచయం పెంచుకుని సహజీవనం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి తెచ్చారు. సులువుగా డబ్బు సంపాదనకు దొంగతనం చేయాలని నరేష్ చెప్పగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అలివేలు సైతం అంగీకరించింది. మంచిర్యాలలోని లక్ష్మికి భర్త లేడని, డబ్బులు, బంగారం ఉన్నాయని, ఒంటరిగా ఉంటోందని చెప్పి చోరీకి పథకం వేశారు. గత ఏడాది నవంబర్ 26న మంచిర్యాలకు వచ్చి చోరీకి యత్నించి విఫలమయ్యారు. మరునాడు 27న సాయంత్రం 7గంటల ప్రాంతంలో లక్ష్మి ఇంటికి వచ్చిన నరేష్, అలివేలు ఆమె గొంతు నులిమి హత్య చేశారు. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ దోచుకుని ఇంటికి తాళం వేసి పారిపోయారు. అదే నెల 30 ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఏడు నెలల తర్వాత చిక్కుముడి విప్పారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు నగలు, 20తులాల వెండి పట్టగొలుసులు, మూడుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు రికవరీ చేయాల్సి ఉందని డీసీపీ వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మిస్టరీని ఛేదించిన సీఐ ప్రమోద్‌రావు, సీసీఎస్ ఎస్సై మధుసూదన్‌రావు, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, తిరుపతి, కిరణ్‌కుమార్, సిబ్బంది మహేష్‌బాబు, రాము, సురేష్, జాఫర్, సతీష్‌లను సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ భాస్కర్ అభినందించడంతోపాటు రివార్డు అందజేశారు.

క్రీడా పాఠశాలల్లో కోచ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న కబడ్డీ, అథ్లెటిక్స్ కోచ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఐఎస్(ఏడాది డిప్లొమా కోర్సు) శిక్షణ పొందిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుకు అన్ని ధ్రువీకరణ పత్రాలు జతపర్చి ఈ నెల 11లోగా డీడీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ నెల 15న సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఉంటుందని, వివరాలకు 9440064422 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

భార్య మృతికి కారకుడైన భర్త రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీకి చెందిన ప్రవళిక మృతికి కారకుడైన ఆమె భర్త ప్రశాంత్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, మరో కాన్పు ఇష్టం లేని భర్త శ్రీనివాస్ భార్యకు గర్భం దాల్చకుండా మాత్రలు వేశాడు. దీంతో ఆమెకు తీవ్ర రక్త స్రావం జరిగింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందగా భర్త పరారీలో ఉన్నాడు. ఈమేరకు మంగళవారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.